


# సెంటిమెంట్

విశ్వనాథ పావనిశాస్త్రి

మా నాన్న రిటైర్ అవడం. నేను పుట్టడం. మా తాతయ్య పోవడం అన్నీ ఒక్కరోజునే జరిగాయిట. మా నాన్న జిల్లా కలెక్టర్ చేసి. రిటైర్ అయ్యాడు. వాళ్ళ చిన్నప్పుడు చాలా చిన్నప్పుడే పెళ్ళిళ్ళు చేసేవాళ్ళు కదా! పెళ్ళికి మా నాన్నకి పంధొమ్మిది. మా అమ్మకి పదకొండూట వయస్సు.

మా నాన్న సరిగ్గా ఉద్యోగంలో చేరిన రోజునే ఒక మగపిల్లవాడు పుట్టాడుట. వాడి తరువాత నేను పుట్టడమే. మధ్యలో యిహ ఎవరూ పుట్టలేదుట. వాడేమో పదహారు పదిహేడు సంవత్సరాల వయస్సులో స్కూటరు నడుపుతూ "ఏక్సిడెంటు" అయి చనిపోయాడట. అమిత గారాబంగా పెరుగుతున్నవాడు అలా చచ్చిపోయేటప్పటికి. ఆ దుఃఖంలో మా అమ్మా. నాన్న కట్టకట్టుకుని కృష్ణలో పడి చచ్చిపోతారేమోనని. వాళ్ళని కాపాడలేక మా తాతయ్యలిద్దరికీ చచ్చినంత పనయిందట. అవమరి! అటు ఆ తాతయ్యకీ. అమ్మమ్మకీ మా అమ్మ ఒక్కతే కూతురాయె! ఇటు ఈ తాతయ్యకీ. మామ్మకీ మా నాన్న ఒక్కడే కొడుకాయె!


ఇక వీళ్ళకి పిల్లలు పుట్టడం అసంభవం అనుకుంటున్న సమయంలో నేను మా అమ్మ కడుపున పడ్డానని తెలిసి. ఆనందం భరించలేక ఆ తాతయ్యా నేను పుట్టిన తరువాత వంశాంకురం పుట్టాడన్న ఆనందం భరించలేక ఈ తాతయ్యా యిద్దరూ పైకెళ్ళిపోయారుట. మా అమ్మమ్మా. మామ్మా అంతకుముందే యింతింత బొట్లు పెట్టుకుని పైకెళ్ళిపోయి వీళ్ళకోసం ఎదురు చూస్తున్నారు గదా!

మనుషులకి చిన్నతనంలో పుట్టిన పిల్లలు పెద్దతనంలో వచ్చిన డబ్బూ అంటే ప్రేమ అంటారు గానీ: యింత జరిగింతర్వాత. మరి మా అమ్మా. నాన్నలకి ఆ పెద్దతనంలో పుట్టిన నేనే సర్వస్వం అంటే ఆశ్చర్యం ఏముంది? నేను "కాం" అనగానే దమీది కోతి నా ఎదురుగా వుండేది. నాకొంచెం జలుబు చేస్తే చాలు రావణాసురుడి కొంపలో నవగ్రహాలల్లే నిలబెట్టేవాడు మా నాన్న డాక్టర్లని. మా అమ్మ సీతని వెదకటానికి హనుమంతుడు పడ్డ హైరానంతా పడేది. నేను స్కూలుకి వెళ్ళ డానికి నాకో కారు. దానికో డ్రైవరు. నాకో మనిషి. ఇవన్నీ అయిన తరువాత మా నాన్న మళ్ళీ తనొకసారి మధ్యలో స్కూలుకి వచ్చి నేనెల్లా వున్నానో పరామర్శ! అయ్యో ఏం చెప్పమంటారు నా బాధ. కాలేజీకి కూడా మా నాన్న రావడం మొదలు పెట్టేసరికి నాకు మహా చెడ్డచిరాకేసి ఓరోజు అన్నం తినటం మానేస్తే. "సర్లే! ఇక రానులే" అని మా నాన్న అన్నం తినిపించాడు. ఐనా నా వెంట మనిషి మాత్రం అలాగే వున్నాడు. ఇదేమో కాలేజీలో విడ్డూరం. నాకేమో సిగ్గు ఐనా అలాగే నా చదువై పోయింది.

ఇంత గారాబంగా పెరిగిన నేను. నా వ్యవహారం ఒక్కసారి కాలేజీలో చదువుతూండగా స్కూటరు కొనివ్వమని అడిగి బోల్తా కొట్టేశాం. మా అమ్మా. నాన్నా శివ పార్వతులల్లే హఠాత్తుగా సగం అయిపోయి వెంటనే తేరుకుని "కంబైన్డ్" గా సావిత్రి దగ్గర యమధర్మరాజు పోజుపెట్టి "అది తప్ప యింకేమైనా అడుగు" అన్నారు. అంతే; నేను పోర్లి గీపెట్టడమేగాని వాళ్ళ హృదయాలు కించిత్ కూడా కదల్లేదు. నేనడిగిన ప్రతిసారీ వాళ్ళు పోజు పెట్టేయడం వాళ్ళపోజుపెట్టేసిన ప్రతిసారీ నాకు పిచ్చెక్కిపోవడం— "వాడి ఖర్మకాలి వాడుచచ్చాడు. నేనూ అలాగే ఛస్తానా? రోజూ ఎంతమంది స్కూటర్లేసుకుని తిరగడంలేదు? అందరూ చస్తున్నారా? ఐనా చావు నా మొహాన వ్రాసి వుంటే మీరాపగలరా?—" ఇలా. గర్భ శోకంతో బీటలు వారిపోయిన వాళ్ళ హృదయాలని. నాగలిములుకుల్లాంటి నా మాటలతో ఎంతకోసినా కడుపుతీపి అనే వర్షపునీటితో తడిసి అవి ప్రేమ అనే పంటనే చేతికిచ్చాయిగాని. నా మీద కోపగించలేదు.

నాకిప్పుడు పెళ్ళయింది; పెద్ద ఉద్యోగమే చేస్తున్నాను; ఒక కొడుకు కూడా. మా అమ్మా నాన్నా పండు ముసలులై పోయారు. వాళ్ళకి మనుమడితోనే కాలక్షేపం. నాకేమో ఎన్ని భోగాలున్నా స్కూటరు కొనుక్కోవాలి అనే కోరిక మాత్రం అగ్నిపర్వతంలా పెరిగిపోసాగింది ఈ అగ్నిపర్వతం నాలో నాలోనే విజృంభించడం ఎవరికీ తెలియదు. నేను స్కూటరు విషయం పూర్తిగా మర్చిపోయాననే అనుకున్నారు అందరూ.

అలా పెరిగిపోతున్న అగ్ని పర్వతాన్ని అణిచే శక్తి నాకు చాలలేదు. ఒక రోజున ఆఫీసు కెళ్తూనే సెలవు పారేసి. నా అసిస్టెంటు చేత కూడా సెలవు పారేయించేసి స్కూటర్లమ్మే బ్రోకరు దగ్గరికి వెళ్ళాను. వాడు మంచి స్కూటరు తీసి యిచ్చాడు. వాడికి చెక్ యిచ్చాను. అసిస్టెంటు సాయంతో దాన్ని బయటకు తీసి, నిండా పెట్రోలు పోయించి సాయంత్రం దాకా




గ్రౌండ్సులోనూ. చిన్న చిన్న రోడ్లమీద తెగ తిరిగాను. ఒళ్ళు మరిచిపోయి తిరుగుతున్న నాకు సాయంత్రం అయ్యేసరికి దడ మొదలయ్యింది. ఈపాటికి మా నాన్న ఒక వంద సార్లు ఆఫీసుకి ఫోను చేసుంటాడు. వివరాలు తెలియక ఏం కంగారుపడుతున్నాడో ఏమో? ఇంటికి పోదామనుకుంటూ అసిస్టెంటు మొహం చూస్తే జుట్టట్టుకుని అమాంతం ఆకాశం అగ్రమ్ములో ముంచి పైకెత్తినట్టుంది.

సరే! ఇక ఇవాల్టికి చాలు అనుకుంటూ ముందుకి వచ్చాము. గుమ్మంలోనే నిలబడ్డ నౌకరు "ఇప్పుడే పెద్దయ్యగారికి గుండె నొప్పొచ్చి శర్మగారి ఆస్పటల్కి తీస్కెళ్ళారండయ్యా! మీకోసం ఎన్ని ఫోన్లు చేసినా మీరెటో ఎలారని. ఎక్కడికో సెప్పలేగని సెప్పారండయ్యా! అయ్యగారు మీకోసం కలవరిత్తరండయ్యా" కంగారుగా చెప్పాడు.

నా గుండె గుభేల్‌మంది. యమ కంగారుగా స్కూటరు స్టార్టుచేసి హాస్పిటల్‌కి బయలుదేరాము.

హాస్పిటల్ దగ్గర స్కూటరాపేటప్పటికి మా ఆవిడ గుమ్మంలోనే నిలబడింది. దూకుడుగా లోపలికెళ్ళాం. అన్ని పరీక్షలూ అయ్యేటప్పటికి గంట పట్టింది. డాక్టరుగారు బయటికి వచ్చి ధైర్యం చెప్తూ "హీ ఈజ్ ఓ.కే. మొదటిసారిగదా! ఏం ఫరవాలేదు. రెండు రోజుల్లో యింటికెళ్ళిపోవచ్చు. మందులు వ్రాసిస్తాను. వాడండి." అన్నాడు. అమ్మయ్యా! గుండె తెరిపిన పడింది.

అప్పుడు గుర్తొచ్చింది స్కూటరు విషయం. గుండె గుబుక్కుమంది. తాళం కూడా వెయ్యలేదే! కంగారుగా నేనూ. నా అసిస్టెంటు బయటికి పరుగెత్తుకు వచ్చాం ఏదీ? స్కూటరేదీ! నా అసిస్టెంటు డెలీరియం వచ్చినట్లుగా "స్కూటర్ సార్ స్కూటరు" అంటూ కాలు కాలిన పిల్లిలా అటూయిటూ గెంతుతున్నాడు. నాకు తెలుసు. యీ పాటికి అది ఏ రాజస్థానో. పంజాబో వెళ్ళిపోయి వుంటుంది. కంప్లెయింట్ కూడా అనవసరం.

వెనకాలే వచ్చిన మా అమ్మ విషయం తెల్సి "పోతే పోయిందిలే వెధవ స్కూటర్ శని వదిలిపోయింది. అది పోయింది కనకనే ఆయన దక్కారు. ఇట్టాంటి పిచ్చిపని ఇంకెప్పుడూ చేయకు. ఆయనసలే హార్టు పేషంటు." అని కోప్పడింది. నేను తలొంచుకొని నిలబడిపోయాను. ✱

---

# జాలిగుండె

## యడవల్లి సుధీర్



రైలు వేగంగా పరిగెడుతోంది. ఫస్టుక్లాసు బెర్తుల మీద నేను. నా భార్య. పిల్లలు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాం. మొదటి నుంచీ నాది చాలా జాలిగుండె. ఎవరే మాత్రం బాధపడినా నేను విలవిల్లాడిపోతాను. అందుకే చిన్నతనంలో పిల్లలు తెలియక క్రిమికీటకాదుల్ని హింసించినా చాలా బాధపడేవాడ్ని. నేను ఏదో ఆలోచిస్తూ కిటికీలోంచి బయటకు చూస్తున్నాను. ఇంతలో పిల్లలు "ఆకలి" అన్నారు. నా భార్య ఇంటినుంచి తెచ్చిన అన్నం పొట్లాలువిప్పి అందరికీ వడ్డిస్తోంది. అత్తవారింటినుంచి వస్తూండటంచేత అవన్నీ పిండివంటలతో రకరకాల రుచికరమైన పదార్థాలతో నిండి ఉన్నాయి. ఇంతలోనే రైలు ఓ జంక్షన్ స్టేషన్‌లో ఆగింది మేం భోజనాలు చేస్తున్నాం. పిల్లలు కేరింతలు కొడుతూ పిండివంటల కోసం పోటీపడుతున్నారు. నా భార్య వాళ్ళని సున్నితంగా మందలిస్తోంది.

ఇంతలో మా కంపార్ట్‌మెంట్ దగ్గిరికి ఓ కుర్రాడొచ్చాడు. వాడికి పదేళ్ళు ఉంటాయేమో. మాసికల నిక్కరు. చిరుగుల చొక్కా వాడి శరీరాన్ని పూర్తిగా కప్పలేకపోతున్నాయి. వాడిని చూడగానే నా హృదయం ద్రవించింది. వీపుకంటుకుపోయిన పొట్టని. లేత శరీరంలోంచి కనపడుతున్న నరాలని వాడి చిరుగుల చొక్కా కప్పలేకపోతోంది. వాడు "అయ్యా" అన్నాడు దీనంగా. లోతుకుపోయిన వాడి కళ్ళలోకి చూస్తుంటే నేను కాలేజీలో వుండగా రాసిన విప్లవగేయాలు గుర్తొచ్చాయి. మా ఆవిడ వాడ్ని కసురుకుంది. అయినా వాడు వెళ్ళడంలేదు. వాడి పరిస్థితిని గురించి ఆలోచిస్తుంటే నా మనస్సు కరుణతో నిండిపోయింది. నాకు ఈ వ్యవస్థ మీద విపరీతమైన కోపం వచ్చింది. నిర్దయులైన పెట్టుబడిదారులమీద. పేదల స్థితిని బాగుచేయలేని ప్రభుత్వం మీద నాకు అసహ్యం వేసింది. మా భోజనాలు అయిపోయాయి. నిరాశ నిండిన కళ్ళతో చూస్తూ ఒక్కసారి వాడు పెదవులు నాలికతో తడుపుకున్నాడు. వాడినలా చూస్తుంటే నా హృదయం ఆర్ద్రమైంది.

"అయ్యా! పోనీ పది పైసలియ్యండి" అన్నాడు వాడు దీనంగా. నా జేబులో ఒక యాభై పైసలదాకా చిల్లర ఉన్నట్టు నాకు జ్ఞాపకం. కానీ వెంటనే నాకో విషయం తోచింది. ఒకవేళ వచ్చే స్టేషన్‌లో పిల్లలేమైనా కొనిపెట్టమని అడిగితే అప్పుడెలా? సమయానికి చిల్లరలేక కొనలేకపోతే వాళ్ళ మనసు బాధపడదూ? నా దసలే జాలిగుండె: వాళ్ళనెలా బాధపెట్టగలను. ఇంతలో రైలు కదిలింది. వాడు నిరాశగా వెనుదిరిగాడు. నేనుమాత్రం వాడి స్థితిగురించే ఆలోచిస్తూ బాధపడుతున్నాను. అలా ఆలోచిస్తుంటే నా గుండె నీరయిపోతోంది. నా హృదయం 'జాలి' గా రోదిస్తోంది.

రైలు 'జాలీ'గా వేగం పుంజుకుంటోంది.